క్లుప్తంగా

కులగణన సర్వే సమర్థంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రత్నకుమారి

కడియం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న కులగణన సర్వేను క్షేత్రస్థాయి సిబ్బంది సమర్థంగా నిర్వహించాలని ఎంపీడీవో కె.రత్నకుమారి ఆదేశించారు. ఈ మేరకు మండల స్థాయి అవగాహనా సమావేశం గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. మండల స్థాయి అధికారులు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. సమర్థంగా సర్వే నిర్వహించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తహసీల్దార్ ఎం.సుజాత, ఈవోపీఆర్డీ వైఎస్ఎన్వీఎస్ లక్ష్మి, జేఈ త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలి రండి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకులు

ధవళేశ్వరం: విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్న నేపథ్యంలో కార్యక్రమానికి అధిక సంఖ్యలో వైఎస్సార్ సీపీ శ్రేణులు తరలి రావాలని ఆ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు తలారి వరప్రసాద్, మోర్త పావనమూర్తి, చాటకాల చంటి, బోడపాటి కుమార్, మిరప రమేష్, కమలాకర్, దేవదాసి గోపి, రమేష్, మురళి తదితరులు పిలుపునిచ్చారు. మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో ధవళేశ్వరం నుంచి అధిక సంఖ్యలో తరలి వెళుతున్నామన్నారు.

గోదావరిలో వ్యక్తి మృతదేహం



ధవళేశ్వరం: గ్రామంలోని రామపాదాల రేవు వద్ద గోదావరిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు ధవళేశ్వరం ఏఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. మృతుడి వయసు సుమారు 40 ఏళ్లు ఉంటుందని, అతడి ఒంటిపై టీ షర్టు, జీన్స్ ప్యాంటు ఉన్నాయన్నారు. ఆచూకీ తెలిసిన వారు 94908 86717 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

బ్యూటీషియన్, కుట్టు, మగ్గం కోర్సుల్లో శిక్షణ

రాజమహేంద్రవరం సిటీ: లాలాచెరువులోని స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో బ్యూటీషియన్, మగ్గం, టైలరింగ్ కోర్సులలో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సేవా సంస్థ నిర్వాహకుడు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ ఈ కోర్సుల్లో ప్రవేశానికి కనీసం పదో తరగతి చదివిన వారికి అవకాశం ఉంటుందన్నారు. ఫిబ్రవరి 5 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమై, 45 రోజుల పాటు జరుగుతాయన్నారు. శిక్షణలో మెటీరియల్, మధ్యాహ్న భోజనం ఉచితంగా అందించడంతో పాటు శిక్షణ అనంతరం ఉత్తీర్ణత పత్రాలను అందిస్తామన్నారు. ఆసక్తి కలవారు 98498 47489, 94907 10850 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

కందుల దుర్గేష్‌కు పరామర్శ



కందుల దుర్గేష్‌ను పరామర్శిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి


సీటీఆర్ఐ/రాజమహేంద్రవరం రూరల్: భార్యా వియోగంతో బాధపడుతున్న జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్‌ను గురువారం సాయంత్రం వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి పరామర్శించారు. ఆయన భార్య ఉషారాణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. అలాగే జనసేన పార్టీ రాష్ట్ర వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం తదితరులు దుర్గేష్ కుటుంబాన్ని పరామర్శించారు.

సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలి

రాజమహేంద్రవరం సిటీ: విశాఖ విమానాశ్రయంలో నాటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కోడి కత్తితో హత్యా యత్నం చేసిన కేసులో అరెస్టయిన జనుపల్లి శ్రీనివాసరావు కేసు విషయంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ కోరారు. తనకు బెయిల్ మంజూరు చేయకపోవడాన్ని నిరసిస్తూ జైలులో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన నిందితుడికి మద్దతుగా నగరంలోని తన నివాసంలో ఆయన.. శ్రీను కుటుంబ సభ్యులు, దళిత నాయకులతో కలసి గురువారం రిలే దీక్ష చేపట్టారు.

కాటన్ బ్యారేజీకి మంచి రోజులు

- రూ.70 కోట్లతో ఆధునీకరణకు ప్రతిపాదనలు
- ఇప్పటికే శరవేగంగా సాగుతున్న రోడ్డు పనులు



ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ రోడ్డు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీకి మంచి రోజులు రానున్నాయి. ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపడంతో త్వరలో పూర్తి ఆధునీకరణకు మార్గం సుగమం కానుంది. ఇటీవల ప్రపంచ బ్యాంక్ బృందం బ్యారేజీని సందర్శించి ఇరిగేషన్ అధికారుల నుంచి వివరాలు సేకరించింది. సుమారు రూ.70 కోట్లతో బ్యారేజీ ఆధునీకరణ పనులకు ప్రతిపాదనలు పంపారు. వీటిలో హోయిస్ట్ మెకానిజమ్, బ్యారేజ్ గేట్లు , గేర్ బాక్స్, లిమిట్ స్విచ్, బ్రేక్ యునిట్, మోటార్లు, వైర్ రోప్ తదితర పనులను ఆధునీకరణలో చేపట్టేందుకు ప్రతిపాదించారు.

పూర్తిస్థాయిలో అభివృద్ధి

బ్యారేజీ నిర్మాణం పూర్తయ్యి 40 ఏళ్ల గడవడంతో పూర్తి స్థాయి ఆధునీకరణ పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. మరోపక్క కాటన్ బ్యారేజీ రోడ్డు ఆధునికీకరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఇప్పటికే రోడ్డుపైన ఉన్న లేయర్‌ను తొలగించారు. రోడ్డును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు రూ.2 కోట్లు కేటాయించారు. రోడ్డుకు సంబంధించి మొత్తం 6.8 కిలోమీటర్ల మేర పనులు జరుగుతున్నాయి. తాత్కాలిక మరమ్మతుల ద్వారా సమస్య మొదటికి వస్తుండటంతో బ్యారేజీ రోడ్డు పూర్తి స్థాయి అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది.

సమస్య పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

బ్యారేజీ రోడ్డు సమస్య పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మరమ్మతు పనులతో త్వరగా రోడ్డు పాడవుతుండటంతో పూర్తి స్థాయి రోడ్డు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. గతంలో మరమ్మతుల సమయంలో సీసీ రోడ్డుపై తారు రోడ్డు వేశారు. అయినా తరచూ ధ్వంసమవుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకొని బ్యారేజీ రోడ్డు పూర్తి స్థాయి అభివృద్ధికి ప్రభుత్వం రూ.2 కోట్లు కేటాయించింది. కలెక్టర్ కె.మాధవీలత ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో పనులను పర్యవేక్షిస్తున్నారు. ధవళేశ్వరం, మద్దూరు, ర్యాలి, విజ్జేశ్వరం ఆర్మ్‌లలో రోడ్డును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నారు. ఈనెలాఖరుకు నిర్మాణ పనులు పూర్తి చేసి ట్రాఫిక్‌ను పూర్తి స్థాయిలో అనుమతించే విధంగా అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

> **ప్రతిపాదనలు పంపాం**
>
> కాటన్ బ్యారేజీ పూర్తి స్థాయి ఆధునీకరణకు రూ.70 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. ఇటీవల బ్యారేజీ పరిశీలనకు వచ్చిన ప్రపంచ బ్యాంకు బృందం సభ్యులకు చేపట్టాల్సిన పనులను వివరించాం. ఇప్పటికే బ్యారేజీ రోడ్డు ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి.
>
> – జి శ్రీనివాసరావు, ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ, ధవళేశ్వరం

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు హరీష్

ప్రకాశం నగర్: నంద్యాలలో ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు నగరానికి చెందిన రేంజర్స్ స్పోర్ట్స్ క్లబ్ నుంచి జి.హరీష్ ఎంపికయ్యారు. సామర్లకోట జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 17న జరిగిన జిల్లా జట్టు ఎంపికలో హరీష్ విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో క్లబ్ అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు నాగేంద్ర, కార్యదర్శి బి.అజ్జి బాబు తదితరులు హరీష్‌ను అభినందించారు.

రథం నిర్మాణానికి వితరణ

కడియం: కడియపులంకలోని ముసలమ్మ అమ్మవారి రథం నిర్మాణానికి శ్రీ విశ్వేశ్వర హైటెక్ నర్సరీ అధినేతలు నక్కా కాశీ విశ్వేశ్వరరావు, అమ్మిరాజు సోదరులు ముందుకు వచ్చారు. ప్రతి ఏటా ముక్కనుమ రోజున అమ్మవారి రథోత్సవం నిర్వహించాలని నిర్ణయించారు. అందుకు అవసరమైన రథాన్ని నిర్మించేందుకు వీరు ముందుకు వచ్చారని ఆలయ కమిటీ తెలిపింది. ప్రముఖ సిద్ధాంతి దొంతంశెట్టి కాళహస్తీశ్వరరావు పర్యవేక్షణలో రథం సిద్ధమవుతుందన్నారు. ఈ సందర్భంగా దాతలను గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ, నర్సరీ రైతులు గురువారం ఘనంగా సత్కరించారు.

హుకుంపేటలో సామాజిక తనిఖీ ప్రజావేదిక



కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధి హామీ అధికారులు

రాజమహేంద్రవరం రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి రూరల్ మండలంలో నిర్వహించిన సోషల్ ఆడిట్ సామాజిక తనిఖీలో వివిధ వర్కులపై రూ.25,750 జరిమానాతో పాటు, రూ.5435ను సిబ్బంది నుంచి రికవరీ చేసినట్టు డ్వామా ఏపీడీ బి.రాంప్రసాద్ తెలిపారు. హుకుంపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదికను ఎంపీడీవో డి.శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. 2022–23లో చేపట్టిన ఉపాధి హామీ పథకంలో వివిధ శాఖల సమన్వయంతో రూ.7.63 కోట్లను వివిధ పనులకు ఖర్చు చేసినట్టు ఏపీడీ రాంప్రసాద్ తెలిపారు. ఫారంపండ్స్, రింగ్ (టెంచెస్, సోక్‌పిట్స్, డైవర్షన్ డ్రెయిన్స్) తదితర పనులను గుర్తించి ఉపాధి హామీ కూలీలకు 100 రోజుల పని కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అంబుడ్స్‌మెన్ జ్యోతి, పంచాయతీరాజ్ ఏఈ సంపత్‌కుమార్, మండల పరిషత్ కార్యాలయం పరిపాలనాధికారి సుబ్బారావు, హెచ్‌ఆర్ మేనేజర్ డీవీఎ.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

తీర్థ క్షేత్రాలు, సాగర తీరాలు వినోద కేంద్రాలు కావు



సామవేదం షణ్ముఖశర్మ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): తీర్థ క్షేత్రాలు, సాగర తీరాలు వినోద కేంద్రాలు కావని, అవి తపోభూములని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. హిందూ సమాజంలో ఆయన గురువారం 37వ రోజు ప్రవచనాన్ని కొనసాగించారు. సముద్ర జలాలలో పర్వదినాల్లో మాత్రమే స్నానం చేయాలి. ప్రాయశ్చిత్త విధులలో భాగంగా, శాస్త్ర నియమ నిబంధనలను అనుసరించి స్నానం చేయవచ్చన్నారు. ఫుడ్ అండ్ ఫన్ సెంటర్లు నెలకొల్పరాదని అన్నారు. సాగరుని ప్రసన్నం చేసుకోవడానికి దర్భాసనం మీద ఉపవాస నియమాలను పాటించి దీక్షగా ఉపాసించినా సాగరుడు ప్రసన్నం కాలేదు. 'లోకంలో శాంతం, సహనం ఇత్యాది లక్షణాలు ఉన్నవారిని అసమర్థునిగా భావించడం పరిపాటి, నేను ఇప్పుడే సాగర జలాలను ఇంకింపచేస్తాను' అని రాముడు విల్లు తీసుకున్నాడు. మేరు పర్వతం వద్ద ఉదయిస్తున్న సూర్యునిలా సాగరుడు ప్రత్యక్షమయ్యాడు. ''రామా! ప్రకృతి నియమాలకు నేను బద్ధుడిని, ఈ నియమాలను ఏర్పరిచినవాడు పరమాత్మయే, నేను నాపై సేతువు నిర్మించడానికి మార్గం సుగమం చేస్తాను.'' అని సాగరుడు చెప్పగానే, ఎక్కు పెట్టిన బాణాన్ని ఎవరిపై ప్రయోగించాలి, ఇది వ్యర్థం కారాదని రాముడు అడుగుతాడు. ఉత్తరదిశలో ద్రుమకుల్యము అనే పేరుగల ప్రదేశంలో కొందరు దుర్మార్గులు నా జలాల సాక్షిగా పాపపు పనులు చేస్తున్నారని, వారిపై నీ శరాన్ని ప్రయోగించమని సాగరుడు చెబుతాడు. విశ్వకర్మ కుమారుడయిన నీలుడు సాగరంపై సేతువు నిర్మించడానికి సమర్థుడని సాగరుడు తెలియచేస్తాడు. ''ఇతరులు ప్రస్తావించకుండా నా గుణాలను నేను ముందుగా చెప్పుకోరాదు కనుక నేను నా గుణములను గురించి ఇంతవరకు చెప్పలేదు. నేను సాగరంపై సేతువు నిర్మించడానికి సమర్థుడనే' అని నలుడు రామునికి చెబుతాడు. విభీషణునికి శరణు ఇచ్చే సమయంలో రాముడు 'నన్ను రావణుడే శరణు కోరినా, వానికి అభయం ఇస్తానని, ఇది తన వ్రతమని' అంటాడు. విష్ణుసహస్రనామంలోని 'సువ్రతః' అన్న నామంతో రాముని వ్రత లక్షణాన్ని సమన్వయం చేసుకోవచ్చునని శంకరభగవత్పాదులు విష్ణుసహస్రనామ భాష్యంలో పేర్కొన్నారని సామవేదం అన్నారు.

సత్యసాయి ప్రాజెక్టు సిబ్బందితో చర్చలు సఫలం

- సమ్మె విరమించిన కార్మికులు
- నేటి నుంచి యథాతథంగా తాగునీటి సరఫరా



చర్చలకు ముందు నిరసన తెలుపుతున్న ప్రాజెక్ట్ సిబ్బంది

సీతానగరం: పురుషోత్తపట్నంలోని శ్రీసత్యసాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్ సిబ్బందితో అధికారుల చర్చలు గురువారం సఫలమయ్యాయి. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కార్యాలయం వద్ద కాంట్రాక్టర్ రెండు నెలల జీతం నగదును అందించారు. మిగిలిన ఎనిమిది నెలల జీతాలు బిల్లులు అయిన తక్షణమే అందిస్తానన్నారు. అనంతరం సత్యసాయి డ్రింకింగ్ వాటర్ సప్లయ్ మెయిన్‌టెన్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పాటి శేషరావు, ప్రధాన కార్యదర్శి కట్టమూరి వీరబాబు మాట్లాడుతూ అధికారులు, కాంట్రాక్టర్‌తో చర్చలు సఫలం అయ్యాయని, సమ్మె విరమించి శుక్రవారం విధులకు హాజరవుతామన్నారు. కాగా.. గురువారం ఉదయం యూనియన్ అధ్యక్షుడు పాటి శేషరావు, ప్రధాన కార్యదర్శి కట్టమూరి వీరబాబు ఆధ్వర్యంలో సిబ్బంది రాజమహేంద్రవరం ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం వద్ద మోకాళ్లపై నిలిచి నిరసన తెలిపారు.

జగన్ పాలనలో అన్ని వర్గాలకూ మేలు



డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న విష్ణుమూర్తి తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాలకూ మేలు జరిగిందని మండల జేసీఎస్ ఇన్‌చార్జి తాటికొండ విష్ణుమూర్తి అన్నారు. గురువారం సాయంత్రం శాటిలైట్‌సిటీ గ్రామసచివాలయం -1లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం పరిధిలో లబ్ధిదారులు వివరాలతో కూడిన డిజిటల్ బోర్డును సచివాలయ కన్వీనర్లతో కలిసి తాటికొండ విష్ణు ఆవిష్కరించారు. అనంతరం మానమ్మకం నువ్వే జగనన్న బుక్‌లెట్‌ను విడుదల చేశారు. అలాగే వైఎస్సార్ సెంటర్‌లో పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం పరిధిలో రూ.17. 68 కోట్లను డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా లబ్ధిదారులకు అందించామన్నారు. అలాగే రూ.1.66 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందన్నారు. వచ్చే ఎన్నికలలో జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తాడి కృష్ణ, సచివాలయం కన్వీనర్లు చిలుకూరి మనోహర్, కడవకొల్లు వెంకటేశ్వరావు, మీగడ గంగాధర్, మాజీ సర్పంచ్ రుంకాని రమణమ్మ, మాజీ ఉప సర్పంచ్ బొమ్ము శ్రీను, మాజీఎంపీటీసీ కాకరపల్లి అప్పారావు, పార్టీ నాయకులు బత్తిన అప్పారావు, పుచ్చ ప్రసన్న కుమార్ రెడ్డి, సఫారీ నాయుడు, కుడిపూడి సత్యనారాయణ, పుచ్చ గోవింద రెడ్డి, ప్రభు, రుంకాని రవికుమార్, అగ్గి రాముడు, బాల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి అంబేడ్కర్



రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- కోరుకొండలో రక్తదాన శిబిరం

మధురపూడి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని, విజయవాడలో రూ.400 కోట్లతో ఆయన 125 అడుగుల మహాశిల్పాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం సామాజిక న్యాయానికిచ్చిన ప్రాధాన్యతని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండలోని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నివాసంలో గురువారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రారంభించిన ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పాన్ని శుక్రవారం ఆవిష్కరించనున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. దాతలను ఎమ్మెల్యే రాజా అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కోరుకొండ మండల కో కన్వీనర్ గణేశుల పోసయ్య, ఎంపీటీసీ సభ్యుడు (కో ఆప్షన్) గొల్లపల్లి ప్రవీణ్ కుమార్, పార్టీ నాయకులు చాటపర్తి దుర్గారావు, యడ్ల సురేష్, మండపాక వెంకటపతి, ఎస్సీసెల్ మండల కన్వీనర్ పైడిమళ్ల ధనరాజ్ పాల్గొన్నారు.

అత్యధిక మెజార్టీ సాధనే ధ్యేయం

మధురపూడి: చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించి, గతంలో కంటే ఎక్కువ మెజార్టీ సాధనే ధ్యేయంగా పనిచేయాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా విజ్ఞప్తి చేశారు. కోరుకొండలోని ఆయన నివాసంలో గాడాల, నర్సాపురం గ్రామాలకు చెందిన పార్టీ నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ రాష్ట్రంలో మునుపెన్నడూ జరగని రీతిలో అభివృద్ధి చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయ దుందుబి మోగిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాజానగరం నియోజకవర్గంలో రూ.3 వేల కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు జరపడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి పొందిన ప్రతిఫలాలను గుర్తుచేయాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల కో కన్వీనర్ గణేశుల పోసయ్య, చాటపర్తి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు నివాళి

ప్రకాశం నగర్: సంక్షేమ పాలనకు ఆద్యుడు ఎన్టీఆర్ అని పలువురు వక్తలు కొనియాడారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు వర్ధంతి సందర్భంగా గురువారం తిలక్ రోడ్డులోని రాజమహేంద్రవరం సిటీ కార్యాలయం వద్ద ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్, పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సుమారు 250 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. దానవాయిపేట గానుగ వీధిలో ఉన్న సంజీవిని బ్లడ్ బ్యాంకులో తెలుగు యువత రక్తదానం చేశారు. కోటిపల్లి బస్టాండు వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి బీసీ సంక్షేమ సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

సేవలు అజరామరం

కడియం: మాజీ ముఖ్యమంత్రి, దివంగత నందమూరి తారక రామారావు సేవలు అజరామరమని పలువురు పేర్కొన్నారు. ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని మండల కేంద్రమైన కడియంతో పాటు, వేమగిరి, బుర్రిలంక, దుళ్ల తదితర గ్రామాల్లో ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు. కడియంలో వెలుగుబంటి రఘురామ్, బుర్రిలంకలో మార్గాని సత్యనారాయణ తదితరులు పాల్గొని ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు.

170 మందికి వైద్యసేవలు

సీతానగరం: ఇనుగంటివారిపేటలోని వైఎస్సార్ హెల్త్ సెంటర్‌లో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బొబ్బిల్లంక సీహెచ్‌సీ డాక్టర్ ఏసురాణి 170 మందికి వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఇళ్ల వద్ద మంచంపై ఉన్న రోగుల వద్దకు నేరుగా వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుంకర నగేష్ బాబు, ఏఎన్ఎం శాంతి, 104 డీఈవో విజయ్, ఆశావర్కర్ మణి కుమారి పాల్గొన్నారు.

బాలుడి హత్య కేసులో ఇద్దరికి జైలు శిక్ష

రాజమహేంద్రవరం రూరల్: బాలుడి హత్య, తప్పుడు సాక్ష్యాలు ఇచ్చిన కేసులో ఇద్దరికి రాజమహేంద్రవరం రెండో అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి బి.పద్మ జైలుశిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కాకినాడకు చెందిన లక్ష్మికి మల్లెమొగ్గల శివతో వివాహం కాగా, వీరికి ఆరేళ్ల కుమారుడు మంజునాథ ఉన్నాడు. మనస్పర్థల వల్ల వారు విడివిడిగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో లక్ష్మికి సామర్లకోటకు చెందిన దోనం దాసు ఎలియాస్ ఆకాష్‌తో పరిచయమైంది. దీంతో లక్ష్మి, తన కుమారుడు మంజునాథను తీసుకుని దాసుతో కలిసి 2021 మార్చిలో రాజమహేంద్రవరం సీతంపేటకు వచ్చింది. ఇంటి యజమాని, చుట్టుపక్కల వారికి తాము భార్యభర్తలమని వారు నమ్మించారు.

ఎక్కాలు చదవలేదనే కారణంతో..

అదే సంవత్సరం జూలై 27న మంజునాథను టేబుల్ బుక్ చదవమని దాసు చెప్పాడు. అయితే బాలుడు చదవకపోవడంతో కోపంతో దవడల పైనా, తలపైనా గట్టిగా కొట్టాడు. దీంతో మంజునాథ అపస్మారకస్థితిలోకి వెళ్లి మృతి చెందాడు. బాలుడిని ఆస్పత్రికి తీసుకువెళ్లిన లక్ష్మి, దోనదాసులు బాలుడు మంచంపై నుంచి పడిపోవడంతో గాయాలయ్యాయని చెప్పారు. వారిద్దరిపై అప్పటి త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ జి.మధుబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టులో విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో దోనదాసుకు ఐదేళ్ల సాధారణ జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా, (సాక్ష్యాలను తారుమారు చేసినందుకు) మూడేళ్ల సాధారణ జైలుశిక్ష, రూ.2వేలు జరిమానా, కట్టని పక్షంలో మూడు నెలలు సాధారణ జైలు శిక్ష విధించారు. మల్లెమొగ్గల లక్ష్మికి (సాక్ష్యాలను తారుమారు చేసినందుకు) మూడేళ్ల సాధారణ జైలు, రూ.2 వేల జరిమానా, కట్టని పక్షంలో మూడు నెలలు సాధారణ జైలు శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పీపీ కె.రాధాకృష్ణ వాదించారు. త్రీటౌన్ హెడ్ కానిస్టేబుల్ ఎస్.వెంకటేశ్వరరావు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌పి వీరయ్యగౌడ్ కోర్టులో ట్రయల్ పర్యవేక్షించారు.

హామీ ఇచ్చారు.. నెరవేర్చారు..

- కోరుకొండలో శరవేగంగా అగ్నిమాపక కేంద్రం నిర్మాణం
- ఫిబ్రవరి 15 నాటికి ప్రారంభించేలా చర్యలు

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరంలో రూ.80 లక్షలతో చేపట్టిన అగ్నిమాపక కేంద్రం నిర్మాణం చురుకుగా సాగుతోంది. రాజానగరం నియోజకవర్గంలోని మూడు మండలాలకు సేవలందించేందుకు అనువుగా దీనిని నిర్మిస్తున్నారు. కాపవరం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఈ కేంద్రం నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్నాయి. అగ్నిప్రమాదాల జరిగినప్పుడు సత్వరమే సంఘటనా స్థలానికి చేరుకుని, ప్రమాదాన్ని నివారించడానికి అనువుగా ఇది ఏర్పాటవుతోంది.

ఆచరణలో..

2019 ఎన్నికల సమయంలో కోరుకొండలో అగ్నిమాపక కేంద్రాన్ని నిర్మిస్తానని జక్కంపూడి రాజా హామీ ఇచ్చారు. ఆయన ఎమ్మెల్యేగా విజయం సాధించిన వెంటనే ఆ హామీ అమలుకు చర్యలు తీసుకున్నారు. అగ్నిమాపక కేంద్రం నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయడానికి సన్నద్ధమయ్యారు. ఫిబ్రవరి 15 నాటికి ప్రారంభించాలన్న లక్ష్యంతో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ కేంద్రంలో రెండు వాహనాలను నిలుపుదల చేయాలని ప్రతిపాదనలిచ్చారు.

గతంలో పలు ప్రమాదాలు

గత టీడీపీ పాలనలో చాలా అగ్నిప్రమాదాలు జరిగాయి. తాటాకిళ్లు, షాపులు, దుకాణాలు కాలిపోయాయి. సీతానగరం మండలంలో రైతులు పండించిన ధాన్యం కుప్పలపై ఉండగా అగ్నిప్రమాదం జరిగింది. సుమారు 35 ఎకరాల విస్తీర్ణంలోని పంట నాశనమైంది. వేసవిలో మొక్కజొన్న పంట తీసిన అనంతరం చెత్తకు నిప్పు పెడతారు. ఆ మంటలు వ్యాప్తి చెంది కుప్పలపై ఉన్న ధాన్యానికి అంటుకోవడంతో ఈ ప్రమాదం జరిగింది. అలాగే కోరుకొండ మండలం మధురపూడి విమానాశ్రయంలో చెత్తకు నిప్పంటుకుని మంటలు వ్యాపించాయి.

తక్కువ సమయంలో చేరుకునేలా..

రాజానగరం నియోజకవర్గంలో అగ్నిప్రమాదం జరిగితే మంటలను అదుపు చేయడానికి రాజమహేంద్రవరం నుంచి అగ్నిమాపక వాహనం రావాల్సి వచ్చేంది. దానికి సమయం ఎక్కువ పట్టడంతో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండేది. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో కోరుకొండ సెంటర్ పాయింట్ కావడంతో అక్కడే అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. దీని వల్ల ప్రమాదం జరిగిన వెంటనే తక్కువ సమయంలో సంఘటనా స్థలానికి చేరుకునే అవకాశం ఉంటుంది.



నిర్మాణంలో ఉన్న అగ్నిమాపక కేంద్రం

> **జోరుగా పనులు**
>
> ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చుతున్నారు. ఈ కేంద్రాన్ని ఫిబ్రవరి 15వ తేదీకి పూర్తి చేసి, సేవలందించాలన్న లక్ష్యంతో పనులను జోరుగా నిర్వహిస్తున్నారు.
>
> – కంటే వినయ్‌తేజ, వ్యవసాయ సలహా మండలి జిల్లా కమిటీ సభ్యుడు

సినిమాలు

శ్యామల	: సైంధవ్
సూర్యమినీ	: సైంధవ్, నా సామిరంగ
సూర్యప్యాలెస్	: గుంటూరుకారం
స్వామి	: గుంటూరుకారం
శివజ్యోతి	: నా సామిరంగ
అనుశ్రీ	: హనుమాన్
రాజా	: హనుమాన్
అశోక	: సలార్
ఊర్వశి	: నా సామిరంగ
రంభ	: నా సామిరంగ
మేనక	: హనుమాన్
అప్సర	: గుంటూరుకారం
కుమారి	: గుంటూరుకారం
నామవరం	
వీఎస్ మహల్	: హనుమాన్, నా సామిరంగ, సైంధవ్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: నా సామిరంగ, గుంటూరుకారం
కడియం	
వెంకటసూర్య	: హనుమాన్, నా సామిరంగ